అవార్డు అందుకుంటున్న మంత్రి సవిత, కలెక్టర్ టిఎస్ చేతన్



నష్టాలే మిగిలాయి..!

"ఈ ఫొటోలో కన్పిస్తున్న రైతు పేరు రాజశేఖర్. నార్పల మండల కేంద్రానికి చెందిన ఈయన తనకున్న 4.50 ఎకరాల్లో 400 మామిడిచెట్లు సాగు చేశాడు. పదేళ్ల వయస్సున్న చెట్టుకు ఇప్పటి వరకు ఒక్కో చెట్టుకు రూ.35వేలు ఖర్చు చేశాడు. ప్రతి ఏడాది పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోవడంతో నష్టాలను చవిచూశాడు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతం కావడంతో చేసేది లేక దాదాపు 200 మామిడి చెట్లను ఇటీవల తొలగించేశాడు. పంట చేతికంది లాభాలు చూస్తునన్న ఆశ ఒక్క ఏడాది లేకుండా ప్రతి ఏడాది నష్టాలే మిగిలాయి. వేరే దారి లేకనే మనసు చంపుకుని తొలగించేశానంటూ రైతు రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు.

భవిష్యత్తుపై ఆశ లేదు..!

"నార్పల మండల పరిధిలోని కురుగానపల్లి గ్రామానికి చెందిన రైతు నాగిరెడ్డి తనకున్న 5 ఎకరాల్లో 90 మామిడి చెట్లు సాగు చేశాడు. ఆరేళ్ల వయస్సున్న చెట్లు ఉన్నాయి. ఇప్పటి వరకు ఒక్కో చెట్టుపై రూ.30 వేలు ఖర్చు చేశాడు. ప్రతి ఏడాది పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోవడం, తెగుళ్లు సోకి నష్టాలు వెంటాడాయి. దీంతో రైతు నాగిరెడ్డి ప్రొక్లైనర్‌తో చెట్లను తొలగించేశాడు. ఆదాయం వస్తుందని కన్నబిడ్డల్లా పెంచుకున్న తోటలను నరికివేస్తుంటే గుండె తరుక్కుపోతోందంటూ రైతు నాగిరెడ్డి నిస్సాహయతను వ్యక్తం చేశాడు.

ఆశలు చంపుకుని..!

- మధురఫలం.. దక్కని ఫలితం..
- ధర పతనంతో మామిడి రైతు డీలా
- పెట్టుబడులూ చేతికందని దుస్థితి
- చేసేది లేక చెట్ల తొలగింపు
- కలపగా మారుతున్న మామిడి చెట్లు

మధుర ఫలం మామిడి నేల చూపులు చూస్తోంది. ఇష్టపడి తినే పండు ఇప్పుడు ధరలేక దాని మనుగడనే కోల్పోతోంది. ఏడాదికేడాది ధరలు పడిపోవడంతో మామిడి రైతు ఢీలా పడ్డాడు. కనీసం పెట్టుబడులు కూడా చేతికందకపోవడంతో చేసేది లేక మామిడి రైతులు కన్నబిడ్డల్లా సాగు చేసిన మామిడి తోటలను నరికేసుకుంటున్నారు. మధుర ఫలానికి ఆశలు నిర్జీవమైన నేపథ్యంలో భవిష్యత్తుపై ఆశలను'చంపు'కుని పొలాల్లో చెట్లను తొలగించి కలపగా విక్రయించేస్తున్నారు. అనంతపురం జిల్లా నార్పల మండలంలో గత కొంతకాలంగా మామిడి రైతులు చెట్లను తొలగించేస్తున్నారు. ప్రతి ఏడాది నష్టాలను చవిచూడడం కన్నా తొలగించడమే మేలంటూ రైతులు కన్నీటి పర్యవంతం అవుతున్నారు.

ప్రజాశక్తి-నార్పల

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మామిడి సాగు అధికంగా ఉంది. మామిడి పంట సాగు చేస్తే లాభాలు రాకున్నా నష్టాలు రావనేది రైతుల ధీమా. ఇలాంటి పంట ప్రస్తుతం నేల చూపులు చూస్తోంది. నష్టాల మామిడిని సాగు చేయలేక చాలా మంది ఆ చెట్లను తొలగించేస్తున్నారు. నార్పల మండల వ్యాప్తంగా దాదాపు 1600 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. దశాబ్ధకాలంతో పోలిస్తే మామిడి సాగు గణనీయంగా పెరిగింది. బోరుబావుల కింద నీరున్న వారు పండ్లతోటలు సాగు చేయాలనే ఆలోచన వస్తే మామిడి పంటకు ప్రాధాన్యత ఇస్తున్నారు. బాగా కాత వచ్చే సమయానికి ఒక్కో చెట్టుకు రైతు రూ.25 నుంచి రూ.35 వేల వరకు ఖర్చు చేస్తున్నాడు. ఇటీవల కాలంలో మామిడి ధర పూర్తిగా తగ్గిపోయింది. వినియోగదారునికి అమ్మే ధర ఒకటైతే మామిడి రైతు నుంచి వ్యాపారులు కొనే ధర మరోలా ఉంటోంది. ఈ ఏడాది రైతు నుంచి కిలో రూ.5కు మించి కొననట్లు తెలుస్తోంది. మామిడికి కనీస మద్దతు ధర కూడా లేకపోవడంతో కాయలను తోటల్లోనే ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ధర వస్తుందన్న ఆశతో రైతులు ఎంతో శ్రమకోర్చి కాయలను తొలగించి మండీలకు తీసుకుని వెళ్తే అక్కడ వాటిని కొనేవారే కరువుతున్నారు. కనీసం రవాణా ఖర్చులు కూడా చేతికందని పరిస్థితి కన్పిస్తోంది. మద్దతు ధరపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటిమూటల్లాగానే మిగులుతున్నాయి. మద్దతు ధర లేక, కాయలను కొనే వ్యాపారులు లేక ఈ ఏడాది రైతులు పెద్ద ఎత్తున నష్టాలను చవిచూశారు.

కలపగా తరలిపోతున్న మామిడి చెట్లు

మామిడి చెట్ల తొలగింపు

మామిడికి గిట్టుబాటు ధర లేక నార్పల మండలంలోని పలు గ్రామాల్లో మామిడి చెట్లను రైతులు తొలగించేస్తున్నారు. నరికివేసిన చెట్లను కలపగా విక్రయించేస్తున్నారు. కొందరు రైతులు తోటలోనే కాయలను అలానే వదిలేస్తున్నారు. పదేళ్ల క్రితం చెట్లను సైతం తొలగించేస్తున్నారు. నార్పల మండలంలోనే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది మామిడి రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పరిస్థితి ఇలానే కొనసాగిస్తే భవిష్యత్తులో మామిడి పంట కన్పించదనే భావన రైతుల్లో వ్యక్తం అవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పండ్ల తోటలకు మద్దతు ధరను మాటల్లో కాకుండా చేతల్లో అమలు చేసి ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

జెసిబితో కురగానిపల్లిలో రైతు నాగిరెడ్డికి చెందిన మామిడిచెట్ల తొలగింపు..

ధర్మవరం పట్టుచీరకు
జాతీయ గుర్తింపు

ఓడీ-ఓపీ-2024 అవార్డును అందుకున్న మంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి-పెనుకొండ

భారత దేశ సమద్ధమైన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం చేనేత పట్టు చీర 2024 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" ఓడీ–ఓపీ (వన్ డిస్టిక్ వన్ ప్రోడక్ట్) కార్యక్రమం కింద ప్రతిష్టాత్మక జాతీయ అవార్డుకు ఎంపికైంది. ఈ గౌరవం ధర్మవరం పట్టు చీర ప్రత్యేకతను దేశానికి చాటింది. సోమవారం నాడు న్యూ ఢిల్లీ భారత్ మండపంలో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి సవిత, కలెక్టర్ టి.ఎస్. చేతన్ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ఈ అవార్డులు వాణిజ్య రంగానికే కాకుండా, స్థానిక పరిశ్రమలకు విశేష ప్రోత్సాహం కలిగిస్తున్నాయన్నారు. ఇది కేవలం హస్తకళల ప్రదర్శన మాత్రమే కాకుండా, భారతదేశ భవిష్యత్తుకు ఒక సాంస్కృతిక గుర్తింపుగా నిలుస్తుందన్నారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ ధర్మవరం చేనేత కార్మికుల నైపుణ్యానికి, పట్టుదలకు దక్కిన గౌరవం అన్నారు. మార్కెట్, ఉపాధి అవకాశాలు మరింత పెరగడానికి, అంతర్జాతీయ గుర్తింపు సాధించే మార్గంలో ఇది ఒక మైలురాయి అవుతుందన్నారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధికి సహకరించండి : బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య అభివృద్ధి కోసం సహకరించాలని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్‌ను మంత్రి సవిత మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్య అభివృద్ధి కోసం ప్రతిపాదించిన ప్రాజెక్ట్ ఆరోగ్య బాల ఆయుర్ ఆంధ్ర ఇనిషియేటివ్ పై వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ఈ ప్రాజెక్టు కింద పోషకాహార లోపాలతో బాధపడుతున్న జిల్లాల్లోని బీసీ హాస్టళ్లలోని విద్యార్థులు, కిషోర బాలికలకు అశ్వగంధ శతావరి, బ్రహ్మీ, తులసి శంకు పుష్పి, వంటి ఆయుర్వేదిక మూలికలతో తయారిన హెర్బల్ న్యూట్రిషన్ సప్లిమెంటును అందించనున్నారన్నారు. ఎఫ్ఎస్ఎస్ఎఐ ప్రమాణాలకు అనుకూలంగా భోజన ప్రణాళికలతో సమన్వయం చేస్తూ ఆరోగ్యపరంగా శాస్త్రీయంగా రూపొందించబడినదని తెలిపారు. ఈ ప్రాజెక్టు యొక్క ముఖ్య లక్ష్యాలు విద్యార్థులు పోషకహార లోపాల నివారణ రోగనిరోధక శక్తి పెంపు మానసిక అభివృద్ధి, ఏకాగ్రత మెరుగుదల ఆయుర్వేదం ఆధారిత ఆరోగ్య సంస్కృతిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని బీసీ విద్యార్థులకు నూతన ఆయుర్వేద ఆధారిత పోషకఆహారాలను అందించేదుకు ఈ ప్రాజెక్టు కీలమైన అడుగు తఅనిపేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని విధాలుగా సహకరిస్తామని కేంద్రమంత్రిహామీ ఇచ్చినట్లు మంత్రి సవిత తెలిపారు.

హెచ్‌ఎల్సీకి 22 టిఎంసిలు కేటాయిస్తాం

ఎస్ఇ నారాయణ నాయక్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

తుంగభద్ర నుంచి హెచ్‌ఎల్సీకి 22 టిఎంసిల నీటిని కేటాయించేందుకు కృషి చేస్తున్నట్లు హెచ్ఎల్సీ ఎస్ఇ నారాయణ నాయక్ తెలిపారు. జిల్లా సరిహద్దు తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ ఆంధ్ర కర్ణాటకకు తాగునీరు అందిస్తున్న ప్రధాన కాలువను సోమవారం నాడు జలాశయం సూపరింటెండెంట్ ఇంజినీర్ నారాయణ నాయక్ పరిశీలించారు. 105 కిలోమీటర్ల కాలువ పరిశీలన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తుంగభద్ర జలాశయం ట్రిబ్యునల్ కమిటీ తీర్మానంలో హెచ్‌ఎల్సీకి 22 టిఎంసిలు కేటాయించారన్నారు. ఆ నీటిని అందించడానికి జలాశయం నుంచి ఎలాంటి ఆటంకాలు లేవని తెలిపారు. సరిహద్దులో రోజూ 1200 క్యూసెక్కులు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఆంధ్రకు సాగునీరు 20వ తేదీ పైబడి వచ్చే అవకాశం ఉందన్నారు. మరమ్మతులు కారణంగా జరిగిన ఆలస్యం ఆంధ్రప్రాంత రైతులకు నష్టం కలిగిందన్నారు. ఈ పనులు సకాలంలో పూర్తయితే 20వ తేదీకైనా నీరు జిల్లాకు చేరుతుందని తెలియజేశారు. తుంగభద్ర జలాశయం నుంచి 1400 క్యూసెక్కుల నీటిని హెచ్‌ఎల్‌సికి అందిస్తున్నామని, అందులో ఆంధ్ర సరిహద్దుకు 500 క్యూసెక్కుల చేరినట్లు తెలిపారు. తుంగభద్ర జలాశయం నీటిమట్టం జలాశయంలో నవంబర్ నాటికి ఇంకా పెరిగితే ఆంధ్రకు నీరు పెరిగే అవకాశం ఉందన్నారు. నీరొస్తే రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే వీలుందన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడండి : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చిన అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం చూపరాదని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జేసీతో పాటు డిఆర్ఒ పార్థసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఆర్డీవో సువర్ణ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టరేట్లో మొత్తం 281 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా సమస్యలను పరిష్కరించాలన్నారు.. నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తే ప్రజలు పదేపదే కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తేవాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే తగిన కారణాలను సంబంధిత అర్జీదారులకు తెలపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జేసీకి సమస్యను విన్నవిస్తున్న బాధితుడు

సూపర్ సిక్స్ అమలులో 'కూటమి' విఫలం : వైసిపి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

సూపర్‌సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి నాయకులు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరుతో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ధర్మవరం నియోజకవర్గ విస్తతస్థాయి సమావేశాన్ని సోమవారం పట్టణం లోని స్థానిక రాఘవేంద్ర స్వామి మంటపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 13 నెలలు పూర్తికావస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీల నెరవేర్చకుండా ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నాడో ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా చెప్పాలన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో రీసైక్లింగ్ విధానాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలో వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం లోని బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండల నాయకులు, కార్యకర్తలతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డి పల్లి సుధాకర్ రెడ్డి, రావుల చెరువు ప్రతాప్ రెడ్డి, గుర్రం శ్రీనివాసరెడ్డి, చిగిచెర్ల శ్రీనివాసరెడ్డి,,పట్టణ అధ్యక్షులు బాలిరెడ్డి, గోరాకటి పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆరేళ్ల అనంతరం బాధిత మహిళకు న్యాయం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని రామగిరి మండలం గంతిమర్రి గ్రామానికి చెందిన కుమారి పోలేరమ్మకు ఆరు సంవత్సరాల తరువాత న్యాయం జరిగింది. నివాస స్థల సమస్యను ఆరు సంవత్సరాల తర్వాత కలెక్టర్ చేతన్ ద్వారా న్యాయం జరిగింది. అందుకు సంబందించిన వివరాలను ధర్మవరం ఆర్డీవో మహేష్ సోమవారం వెల్లడించారు. గ్రామానికి చెందిన కుమారి పోలేరమ్మ గత కొన్ని సంవత్సరాలుగా నివాస స్థలానికి సంబంధించి సమస్యను ఎదుర్కొంటోంది. ఆమె నివాసానికి ఆనుకుని ఉన్న కొంతమంది వ్యక్తులు, ఆమె స్థలంపై అనధికారికంగా ప్రహరీ, మెట్లు (స్టెప్స్) ఎలక్ట్రికల్ వైర్లను ఏర్పాటు చేసినట్లు బాధితురాలు అధికారులకు ఆరు సంవత్సరాలుగా ఫిర్యాదు చేస్తోంది. ఆరేళ్ల కాలంలో ఇప్పటివరకు ఆమె సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా, సరైన స్పందన రాకపోవడంతో చివరికి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించింది. ఈ సమస్యను పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని ధర్మవరం రెవిన్యూ డివిజనల్ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెవిన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమంగా నిర్మించిన ప్రహరీ, మెట్లు, ఎలక్ట్రికల్ తీగలు తొలగింపజేశారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు మళ్లీ తలెత్తకుండా ఉండేందుకు అధికారులచే స్థలాన్ని కొలతలు వేసి స్పష్టమైన హద్దులు గుర్తించారు. దీంతో బాధితురాలు పోలేరమ్మ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కూడలి వద్ద మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు తక్షణం డిగ్రీ ప్రవేశ నోటిఫికేషన్లు ఆఫ్‌లైన్ విధానంలో విడుదల చేయాలని ఎస్ ఎఫ్ ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ కూడలి వద్ద మోకాళ్ళపై నిరసన చేపట్టారు. ఈ సంధర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈరేష్, నామాల నాగార్జున మాట్లాడుతూ డిగ్రీ అడ్మిషన్ నోటిఫికేషన్ కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారన్నారు. ఇంటర్ ఫలితాలు వచ్చి దాదాపు రెండు నెలలు అవుతున్న నేటికీ డిగ్రీ చేరాలనే విద్యార్థులకు అయోమయం పరిస్థితిలో ఉన్నారని వా పోయారు. డిగ్రీలో డబుల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని విద్యార్థులకు ఇంటర్నల్ షిప్ యొక్క భారాన్ని తగ్గించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె ఆగదని జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు నాయకులు చెప్పారు. సమ్మెలో భాగంగా రెండవ రోజు సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారుజ 62 ఏళ్లకు రిటైర్మెంట్ పెంచాలని, హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ అమలు చేయాలని, ప్రమాద బీమా రూ. 10 లక్షలు అమలు చేయాలని, రిటైర్మెంట్ తర్వాత కారుణ్య నియామకంలో భాగ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలనికోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా, ఇంజనీరింగ్ యూనియన్ కార్మికులు రమణ, రమేష్, గణేష్, రామదాసు, గంగాధర్, శివ, సాయినాథ్, సద్దాం, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: తమ సమస్యల పరిష్కారం కోసం పలు ఆందోళనలు చేసినా ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా స్పందన కరువైన నేపథ్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు బుధవారం నుండి సమ్మెలోకి వెళ్లనున్నారు. మున్సిపల్ వర్కర్స్–ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఇప్పటికే పలు దశల్లో ఉద్యమించిన కార్మికులు విధిలేని పరిస్థితుల్లో ముందుగానే ప్రకటించిన విధంగా ఫెడరేషన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు ఉపక్రమించారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని తదితర ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి. వీటితోపాటు అన్ని రకాల నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం రూ.26 ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. తమ ఇబ్బందులను అర్థం చేసుకుని ప్రజలు తమ సమ్మెకు మద్దతుగా నిలవాలని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సహకరించాలని ప్రజలకు కార్మికులు విజ్ఞప్తి చేశారు.



పుట్టపర్తిలో నాయకులు, కార్మికుల ఆందోళన

21వ రోజుకు చేరిన దీక్షలు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేట్టిన దీక్షలు సోమవారం నాటికి 21వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిన్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతు గత 21 రోజుల నుంచి శాంతి యుతంగా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు నిరసన దీక్షలు చేస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విధి లేని పరిస్థితిలో తాము విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళుతున్నామన్నారు. ప్రధాన సమస్యలతో పాటు స్థానికంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామన్నారు. దీక్షల్లో ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిన్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, నాయకులు రామచంద్ర, బాబయ్య, మూర్తి, శంకరా, చంద్రశేఖర్, కుమార్, బాలాజీ, చంద్ర, మూర్తి, కవితమ్మ, గంగరత్నమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.



హిందూపురంలో నిరసన దీక్ష

ఏపీ రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నంబులపూలకుంట

సిపిఎం అనుబంధ ఏపీ రైతు సంఘం నూతన మండల కమిటీని సోమవారం ఎన్నిక చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాలపల్లి పెద్దన్న, హరి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వి చలపతి, కార్యదర్శిగా వి నాగిరెడ్డి, కోశాధికారిగా బెల్లాల స్వామిరెడ్డి, సభ్యులుగా మల్లిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మయ్య, నరసింహులు, బాబా ఫక్రుద్దీన్, జయరామిరెడ్డి తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కెజిబివికి బకెట్లు అందజేత

ప్రజాశక్తి తలుపుల

మండల కేంద్రంలోని కస్తూరిబాయి గాంధీ పాఠశాలకు మదర్ థెరిస్సా స్ఫూర్తితో రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బకెట్లను అందజేశారు. విద్యార్థినులకు రోజువారి ఉపయోగించే బకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు మన్సూర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మోహనమ్మ ,ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాగునీటి విడుదలకు తూము ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

హంద్రీనీవా కాలువ నుండి సాగునీరు విడుదలకు తూము ఏర్పాటు చేసి కృష్ణా జలాలు తమ పంట పొలాలకు అందించాలని కొత్తచెరువు , చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన చెందిన రైతులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.కాలువకు లైనింగ్ పనులు చేపట్టడం వల్ల తమ పొలాలకు నీరు అందేపరిస్థితి ఉండదన్నారు. హంద్రీనీవా కాల్వకు తూముల ఏర్పాటు చేసి మునుపటిలాగా వంగమేరుకు సాగు నీటిని విడుదలచేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గుత్తి శ్రీరాములు వంగంపల్లి నాగేంద్ర దాసరి శ్రీరాములు చాకలి సంజీవప్ప గుత్తి బావయ్య తదితరులు పాల్గొన్నారు

కళాశాల తనిఖీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని కెహెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆర్జేడీ డాక్టర్ డి. నాగలింగా రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి తో కలిసి బోధనా సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు ."ఎఫ్ఆర్ఎస్, టిఎల్పి, టీచింగ్ డైరీ వంటి బోధనా సంబంధిత అంశాలపై అధ్యాపకులకుపలు సూచనలు చేశారు. తరగతి గదులలోకి వెళ్ళి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం బోధనా సిబ్బంది, విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్. చిట్టెమ్మ, బి.త్రివేణి, ఎస్. షమీఉల్లా, ఎస్. పావని, ఎం. పుష్ప, బి . ఆనంద్, జి.మీనా, జి.ధనంజయ తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ జట్టుకు కదిరి విద్యార్థిని

ప్రజాశక్తి - కదిరి అర్బన్

హర్యానాలో జరిగే ఆల్ ఇండియా ఐపిఎస్సి బాలికల అండర్ 17 ప్రీ నెహ్రూ కప్ పోటీలకు కదిరి లోని చిన్న పిల్లల వైద్యం నిపుణులైన సివి మదన్ కుమార్ కుమార్తె సి. వి .లక్షిత ప్రతిభ కనపర్చడంతో నేషనల్ హాకీ అండర్ – 16 జట్టుకు ఎంపికైందని చెన్నమ్మ సైనిక్ స్కూల్ కోచ్ జయలక్ష్మి తెలియజేశారు. కదిరి బాలిక నేషనల్ టీంలో సెలెక్ట్ కావడం చాలా సంతోషకరమని పాఠశాల సిబ్బంది అన్నారు. లక్షితను కుటుంబ సభ్యులు, కదిరి వాసులు అభినందించారు.

ప్రెస్ క్లబ్ నిర్మాణానికి సాయం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రం లోని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గాదేవి ప్రెస్ క్లబ్ నిర్మాణానికి లక్ష్మీ వెంకటేశ్వర మైన్స్ అండ్ స్టోన్ క్రషర్ యాజమాన్యాలు విరాళం అందజేశాయి. ఈ మేరకు వాటి యజమానులు సుధీర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి రూ. 51,116లను సోమవారం అందజేశారు. ప్రెస్ క్లబ్ పూర్తయిన తర్వాత ప్రెస్ క్లబ్ కు అవసరమైన మేరకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు వారిని సన్మానించారు.

సానిపల్లిలో ఎస్ఎస్జి సర్వే

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని సానిపల్లిలో అధికారులు ఎస్ఎస్జి సర్వేను చేపట్టారు. ఈ మేరకు అధికారులు రామాంజినేయులు, శ్రీనివాసులు,సాయిబాబు తదితరులు గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా వారు గ్రామంలో పరిశుభ్రత, మరుగుదోడ్ల వాడకం పై పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు బాలురకు, బాలికలకు వేరువేరుగా టాయిలెట్స్ ఉన్నాయా, లేదా అని పరిశీంచారు.ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ గోవిందప్ప, మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, ఎంఆర్సి, ఎస్ బి ఎం, ఏపిఎం, ఎన్ఆర్ఈజీఎస్ అధికారలు తదితరులు పాల్గొన్నారు.

Document Missing

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని ముక్కడిపేటలో నివాసం ఉంటున్న **సయ్యద్ నూర్ మొహమ్మద్** అను నేను హిందూపురం పార్టు-2 సర్వే **నెంబరు:102-5A** య.శెం.0-22 పైకి 88,88 చ.గ.లు గల దస్తావేజు నెంబర్:**2344/1996** గల నా ప్లాటుకు సంబంధించిన ఒరిజినల్ లింక్ దస్తావేజు ఎక్కడో పోగొట్టుకొని పోయినది.దీనిపై గోరంట్ల పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినాను. పై కనబరచిన **ఒరిజినల్ లింక్ దస్తావేజు** ఎవరికైనా దొరికనచో **ఫోన్ నెంబర్. 9902641334** కు సంప్రదించగలరు.

కదిరి నియోజకవర్గంలో విజిలెన్స్ తనిఖీలు

సోమవారం కదిరిలో మూసివేసిన పర్టిలైజర్ దుకాణాలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి నియోజకవర్గంలోని పలు పర్టిలైజర్ దుకణాలను విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. 'యూరియా కావాలంటే డీఏపీ కొనాల్సిందే' శీర్షికన సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారలు స్పందించారు. ఈ కథనంపై వ్యవసాయ శాఖ అధికార యంత్రాంగం కదిలింది. మరోవైపు ఈ కథనంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీసి తనిఖీలకు కదిరికి వచ్చారు. అయితే వారి రాకను తమకు అనుకూలమైన అధికారుల నుంచి తెలుసుకున్న పట్టణంలోని పర్టిలైజర్ దుకాణాల యాజమానులు తమ షాపులను మూసివేశారు. కదిరిలో మొత్తం 28 షాపులు ఉన్నాయి. ఒక్కసారిగా అన్ని షాపులు మూకుమ్మడిగా మూసేయడంతో ఎరువుల కోసం వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ శాఖ లో పనిచేస్తున్న ఇంటి దొంగలే విజిలెన్స్ అధికారుల రాకను దుకాణాల యాజమానులకు సమాచారం అందజేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్లకు అలవాటు పడిన వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులను నిట్ట నిలువున ముంచేస్తూ వ్యాపారస్తులకు కొమ్ముగాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం నుండి అనుమతులు లేని నాణ్యతలేని ఎరువులను షాపులలో విక్రయిస్తున్నప్పటికీ ఏ రోజైనా వ్యవసాయ అధికారులు తనిఖీలు చేసిన పాపాన పోలేదు. రైతుల కష్టాలను దోచుకుంటున్న వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల సాధక బాధకాలపై కథనాన్ని ప్రచురించిన ప్రజాశక్తికి రైతుల కతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన
ముందస్తు సమాచారంతో ఫర్టిలైజర్ దుకాణాల మూసివేత

కదిరిలో అధికభాగం నకిలీ మందుల విక్రయాలు : రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన గడ్డి మందులు ఇతర రసాయన మందులు నకిలీ విత్తనాలను కదిరిలో జోరుగా విక్రయిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి వ్యవసాయ శాఖ అధికారులు నుండి అనుమతులు పొందిన కంపెనీ ముద్రించిన లాట్ నెంబర్ గడువు తేదీ దుకాణం పేరు టిన్ నెంబర్ తో కూడిన రాసిన బిల్లు రైతులకు ఇవ్వాలి. అలా కాకుండా దొంగ బిల్లులు సృష్టిస్తూ ప్రభుత్వ ఆదాయాన్నికి గండి కొడుతు ఎస్టిమేట్ బిల్లు రైతులకు ఇస్తున్న షాప్ యాజమాన్యాలను సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. రైతులు చెల్లించిన డబ్బులకు ఒరిజినల్ బిల్లులు చెల్లించకుండా దొంగ బిల్లులు సృష్టిస్తూ రైతులుకు అందజేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

దుకాణాల మూసివేతపై సర్వత్రా చర్చ : కదిరిలో 20 ఫర్టిలైజర్ షాపులుఉండగా విజిలెన్స్ శాఖ అధికారులు వస్తున్నారన్న సమాచారంతో అన్నిటిని మూసివేయడంతో వీరి అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో ఉందన్న చర్చ కదిరిలో జరుగుతోంది. రైతన్నలను మోసం చేస్తున్న షాప్ యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

బదిలీ ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షులు యంవి.కృష్ణారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారుతి ప్రసాద్, జయకృష్ణ, వర్కింగ్, అసోసియేట్ ప్రెసిడెంట్స్ నరేష్ కుమార్, మక్కిశెట్టి కుమార్ కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని పాఠశాలలకు కొత్తగా ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, క్లస్టర్ ఉపాధ్యాయుల పోస్టులను సృష్టించి భర్తీ చేశారన్నారు. నూతనంగా సృష్టించిన పోస్టులకు పొజిషన్ ఐడీ నెంబర్లను కేటాయించక పోవడంతో ఉపాధ్యాయులు వేతనాలు ఇబ్బందిపడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. తొంభై శాతం మంది ఉపాధ్యాయులకు బ్యాంకురుణాలుఉన్నందున ఇఎంఐలు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ఐడీ నెంబర్లను కేటాయించి తక్షణమే వేతనాలు చెల్లించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి సోమవారం చర్యలు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం కళాశాలలో జరిగిన పిటిఎంలో తాగునీటి సమస్యను విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సవిత రొద్దం ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి పైప్ లైన్ ద్వారా నీటిని కళాశాలకు సరఫరా చేయాలని ఆదేశించారు. దీంతో మండల నాయకులు ఆధ్వర్యంలో సోమవారం పైపులైను ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ మద్దిలేటి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చంద్రమౌళి, మాజీ జెడ్పిటిసి చిన్నప్పయ్య, నీరుగంటి వీరాంజనేయులు, పైగేరి సిద్దన్న, ఫీల్డ్ అసిస్టెంట్ జి నరసింహమూర్తి, హై స్కూల్ కమిటీ చైర్మన్ వాల్మీకి సురేష్, బూత్ కమిటీ కో కన్వీనర్ పెడపల్లి రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాసంతి మృతికి నివాళి

ప్రజాశక్తి - బత్తలపల్లి

సిఐటియు అనుబంధ అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి వాసంతి ఆకస్మిక మృతికి సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం గ్రామానికి చేరుకున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు జిల్లా నాయకులు జేవి రమణ సిఐటియు బత్తలపల్లి మండల కన్వీనర్ నరసింహులు, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, ఉపాధ్యక్షులు ఏ మారుతి తదితరులు మాట్లాడుతూ వాసంతి అంగన్వాడీ వర్కర్గా పనిచేస్తూనే యూనియన్ కార్యదర్శిగా ఉంటూ కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించిందన్నారు.కార్మికులకు అండదండలుగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ముందుండి సిఐటియు ఆధ్వర్యంలో అనేక రకాల పోరాటాలు నిర్వహించిందని గుర్తు తెచ్చుకున్నారు. ప్రభుత్వం సహకరించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు రజిత, అలివేలమ్మ, రజియా ,సిపిఐ నాయకులు బండల వెంకటేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

వాసంతి మృతి తీరనిలోటు : యర్రాయపల్లి అంగన్వాడీ కార్యకర్త, ఐసిడిఎస్ బత్తలపల్లి ప్రాజెక్టు కార్యదర్శి వాసంతి మృతి చెందడం బాధాకరమని సిడిపిఓ సరస్వతి అన్నారు. సోమవారం గ్రామానికి చేరుకున్న సిడిపిఓ తదితరులు వాసంతి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మట్టి ఖర్చుల కోసం ప్రభుత్వం అందించే రూ. 15 వేలను వాసంతి భర్త నారాయణ స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ దేవమణి, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్పై రైతులకు అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్. రాజు

ప్రజాశక్తి - మడకశిర రూరల్

నియోజకవర్గంలో ఏర్పాటు కానున్న 2వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టుపై నియోజకవర్గ రైతులకు స్థానిక శాసనసభ్యులు ఎంఎస్.రాజు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. బుళ్లసముద్రం హైవేకి ఆనుకుని ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి అవగాహన సదస్సును ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సదస్సుకు ఇండోసోల్ సంస్థ ప్రతినిధులు, నియోజకవర్గ రైతులు హాజరయ్యారు. ఇండోసోల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ పార్క్ విధానాలు, దీనివల్ల రైతులకు, రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలపై ఎమ్మెల్యే వివరించారు. సోలార్ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన ఒక్కో రైతుకు ఎకరానికి ఏడాదికి ఎలాంటి పెట్టుబడి లేకుండా రూ.31వేలు ఆదాయం వస్తుందని తెలిపారు. అంతేకాకుండా ప్రతి రెండేళ్లకు అదనంగా 5శాతం రాయితీ లభిస్తుందని, దీని ప్రకారం ఒక్కో ఎకరాకు రూ.1,500అదనంగా లభిస్తుందని తెలిపారు. అంతేకాకుండా సోలార్ ప్రాజెక్టు వస్తే ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రైతుల భూములకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని, మడకశిర నియోజకవర్గంలోని రైతులందరికీ ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా సోలార్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, టీడీపీ మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్కు అందజేశారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకులు కేకే రాజారెడ్డి ఖాదర్బాషా, పారిశుధ్య కార్మికుడు అక్కులప్ప తదితరులు మాట్లాడుతూ గతంలో పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం దాదాపు పది రోజులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారన్నారు. ఆసమయంలో డిఎల్పిఓ, ఎంపిడిఓ, ఈవోఆర్డీ తదితరులు ఆర్థిక సంఘం నిధులు మంజూరైన వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పటికి రెండు నెలలైనా పారిశుధ్య కార్మికుల సమస్య పరిష్కరించలేదన్నారు. స్పందించిన ఎంపీడీవో వెంకటరామిరెడ్డి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు కదిరప్ప, ఆంజనేయులు, అనిల్, బాలకృష్ణ, వెంకటరమణ, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు దారిచూపండి : మహిళా రైతులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

తమ భూములకు వెళ్లే దారిని రెండేళ్లుగా ఒక వ్యక్తి మూసి వేయడంతో తమ భూములు బీడు భూములుగా మారాయని మాకు దారి చూపాలని కలెక్టరేట్ వద్ద మహిళా రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. సోమవారం గోరంట్ల మండలం దిగువ గంగంపల్లికి చెందిన మహిళా రైతులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుమారు 100 మంది రైతులు 500 ఎకరాల భూమినిఎన్నో ఏళ్లుగా తరతరాల నుంచి సాగు చేసుకుంటున్నామన్నారు. గత రెండు సంవత్సరాలుగా తమ పొలాలకు వెళ్లే దారిలో తమకు హక్కు ఉందంటూ గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి దారి మూసి వేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దారి లేక పంటలు పెట్టుకోలేక భూములన్నీ బీడుగా మారాయని వాపోయారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేకుండా పోయిందన్నారు. పంటలు పెట్టనందున రైతులు కూలీలుగా మారాల్సి వస్తోందని, అదేవిధంగా వలసలు వెళ్లడానికి సిద్ధమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే దారి చూపాలని డిమాండ్ చేశారు. దీంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్య నారాయణ రెడ్డి అక్కడికి చేరుకొని వారి సమస్య తెలుసుకొని అర్జీ స్వీకరించారు. రెండు రోజులలో రహదారి గురించి సర్వే చేసి రైతులకు న్యాయం చేయాలని వెంటనే గోరంట్ల తహశీల్దార్కు, ఆర్డీవోకు ఫోన్ ద్వారా ఆదేశించారు.

కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న మహిళలు

జిల్లా కోర్టుకాంప్లెక్స్ కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్యసాయి జిల్లా లో జిల్లా కోర్టు కాంప్లెక్ సామూహిక భవన నిర్మాణాల నిమిత్తం అవసరమైన స్థలాన్ని సత్వరమే సమకూర్చాలని జూనియర్ సివిల్ జడ్జి జిల్లా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పుట్టపర్తి బార్ కు చెందిన న్యాయవాదులు రెవిన్యూ సిబ్బంది తో కలసి జిల్లా కోర్టు సామూహిక భవనముల కొరకు అనువైన స్థలం కోసం కప్పలబండ పంచాయితీలో రెండు చోట్ల భూముల పరిశీలన చేశారు. తహశీల్దార్ కళ్యాణ్ సర్వే సిబ్బంది తో కలసి ప్రశాంతి గ్రామ్ లోని ఎన్ టీ చౌదరి లేఅవుట్ కు సమీపం లోనూ. పారిశ్రామిక వాడకు సమీపం లో చక్కటి మౌళికసదుపాయలను కల్గిన భూమిని రెవిన్యూ సిబ్బంది చూపెట్టారు. జిల్లా కోర్టు సామూహిక భవనాలకు 10 నుండి 12 ఎకరాలు భూమి అవసరమని ఆ దిశగా కేటాయింపు వుండాలని జూనియర్ సివిల్ జడ్జి తహశీల్దార్ కళ్యాణ్ కు సూచించారు.

చెరువును పూడ్చి వేస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని లోచర్ల గ్రామంలో కొందరు వ్యక్తులు చెరువును పూడ్చివేసి స్థలాలు ఆక్రమించుకుంటున్నారని వారి పైన చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు స్థానిక తహశీల్దార్కు సోమవారం ఫిర్యాదు చేశారు. టిడిపి స్థానిక నాయకులు పెద్దన్న ఆధ్వర్యంలో పలువురు సోమవారం స్థానిక ఇన్ఛార్జి తహశీల్దార్ బాలాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ చెరువు కింద 282 ఎకరాల ఆయకట్టు భూమి ఉందని చెరువు నిండితే రైతులు పంటలు పెట్టుకొని జీవనోపాధి పొందుతారని అన్నారు. చెరువును పూడ్చి వేయడం ద్వారా పంట సాగుకు కూడా నీరు సరిపోవటం లేదన్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. అదేవిధంగా గతంలో హైకోర్టు నందు పిటిషన్ కూడా వేశామని అది పెండింగ్లో ఉందని అన్నారు. అయినా కూడా కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా చెరువును పూడ్చివేస్తున్నారన్నారు. ఇది ఇలానే కొనసాగితే ఆర్డీవోకు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

కారులో నగదు చోరీ

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలో వాసవి ఫంక్షన్ హాల్ సమీపాన కారులో ఉంచిన ఏడు లక్షల రూపాయల నగదును గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం పట్టపగలు ఎత్తుకెళ్లారు. కారు అద్దాలు పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడైన మండలంలోని మల్లాపల్లికి చెందిన రామచంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు తన కుమారుడి వివాహం అవసర నిమిత్తం స్టేట్ బ్యాంకులో సోమవారం నగదు డ్రా చేసి కారులో ఉంచానన్నారు. వాసవి మహల్ ఫంక్షన్ హాల్ వరకు వచ్చి ఫంక్షన్ హాల్ ముందర కారు ఆపి కారులోనే నగదు ఉంచి ఫంక్షన్ హాల్లోకి వెళ్లామన్నారు. తాము వెళ్లి వచ్చేలోపే కారు అద్దాలు పగలగొట్టి కారులో ఉన్న రూ. 7 లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు.

ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండలంలోని కొండకమర్ల పంచాయతీ గంగిరెడ్డిపల్లిలో శివారెడ్డి పొలంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సోమవారం పొలానికి వెళ్ళిన శివారెడ్డి ఈ విషయాన్ని గమనించారు. ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైర్లు దొంగలించి వెళ్లినట్లు రైతు తెలిపారు చోరీ జరిగిన విషయాన్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.

ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూస్తాం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై చట్టపరిధిలో విచారణ జరిపి తగు సమయంలో బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి.రత్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో చట్ట ప్రకారం విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నామని తెలిపారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులను పునరావృతం కాకుండా చూడాలనిసంబంధిత అధికారులతో ఫోన్లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు, మహిళా పిఎస్ డీఎస్పీ ఆదినారాయణ , లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

టిడిపి ధర్మవరం పట్టణ కమిటీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఈ మధ్య కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ మహిళా కార్యకర్త బళ్ళారి నాగరత్నమ్మ కుటుంబానికి పరిటాల శ్రీరామ్ తరపున టిడిపి నేతలు సోమవారం ఆర్థికసాయం చేశారు. మృతురాలి భర్త బళ్లారి వెంకటేష్ కు 40 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతలపల్లి మహేష్ చౌదరి, వార్డు ఇన్ఛార్జి అడ్ర మహేష్, నాయకులు రాళ్లపల్లి షరీఫ్,బీబీ, పురుషోత్తం గౌడ్, సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : .కదిరి రూరల్ మండలంలోని వీర చిన్నయ్య గారిపల్లిలో బాధిత కుటుంబానికి టిడిపి నాయకులు ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన రత్నమ్మ భర్త ఇటీవల మృతి చెందాడు. దీంతో కుటుంబ పోషణ భారమై పిల్లలను పోషించుకోలేని స్థితిలో ఆర్థికంగా రత్నమ్మ ఇబ్బంది పడుతోంది. ఈ నేపథ్యంలో గ్రామంలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా రత్నమ్మ కష్టాలను నాయకులు తెలుసుకున్నారు. దీంతో స్పందించిన గ్రామ ఇన్ఛార్జి, టిడిపి నాయకుడు చిన్న తక్షణ సాయంగా రూ. 15వేలను బాధితురాలికి అందజేశాడు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను రాష్ట్ర విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శివకుమార్ తన సిబ్బందితో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల బస్తాలను, రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ను అప్డేట్ చేసుకోవాలన్నారు. ఎరువుల ధరల పట్టికను కొనుగోలు దారునకు అందుబాటులో ఉంచాలన్నారు. పిసిలో లేని ఎరువులు,విత్తనాలు,క్రిమి సంహారక మందులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల సమాచారం తెలుసుకున్న రెండు దుకాణాలను వాటి యజమానులు అప్పటికప్పుడు మూసివేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిఐ శివన్న,అసిస్టెంట్ డైరెక్టర్ సనావుల్లా,మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కనిపించని అధికారులు

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవలం తహశీల్దార్, ఎంపీడీవో, ఏఎస్ఐ వెంకటరాముడు, మెడికల్ ఆఫీసర్లు మాత్రమే హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యర్రకమానికి మండలంలోని ఆయా శాఖల అధికారులంతా హాజరు కావలసి ఉండగా విద్యాశాఖ, ఐసిడిఎస్, ఏఈలు ఆర్డబ్ల్యూఎస్ ట్రాన్స్కో, పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్టీసీ, మైన్స్ అండ్ జియాలజీ, ఫారెస్ట్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, తదితర శాఖలకు సంబంధించిన అధికారులు డుమ్మా కొట్టారు. అయితే వీరంతా కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చి ప్రజాసమస్యల పరిష్కార వేదికకు హాజరైనట్లుగా రిజిస్టర్లో సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారని సమాచారం. మూడు నెలలుగా ఈ తంతు జరుగుతున్నట్లు తెలిసింది.కాగా వివిధ గ్రామాల నుంచి పలు సమస్యలపై వచ్చిన లబ్ధిదారులు సంబంధిత శాఖ అధికారుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బదిలీ బ్యాంకు మేనేజర్కు సన్మానం

ప్రజాశక్తి-పెనుకొండ

స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్గా పనిచేస్తూ పుంగనూరు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుకు బదిలీ అయిన పవన్ కుమార్ను పట్టణ ప్రముఖులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్కుమార్ పుంగనూరు బ్రాంచ్ స్కేల్ 4 మేనేజర్ గా ఉద్యోగోన్నతిపై వెళ్లడం అభినందనీయం అన్నారు. పెనుకొండ ప్రాంత వాసులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు, రమణమ్మ, రామాంజనేయులు,మెప్మా సి ఇ ఓ సాధికార భాను,సమతా ఆదినారాయణ రెడ్డి, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సురేంద్ర నాథ్ రెడ్డి, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

నల్లచెరువు మండలం శ్రీ పాలపాటిదిన్నే ఆంజనేయ స్వామి దేవాలయం అధ్వర్యంలో జరిగే శ్రావణమాస మహోత్సవాలకు సంబందించిన ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈవోతో పాటు అధికారులు, ఆలయ కమిటీసభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో పిల్లల శాతాన్ని పెంచాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి ప్రాజెక్ట్ పరిధిలో గల పరిగి సోమందేపల్లి గోరంట్ల సంబంధించిన అంగన్వాడి టీచర్లతో సోమవారం సిడిపిఓ శాంతా లక్ష్మి, సిసిడిఓ గీతా బాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ బాల్య ఆరంభ విద్యా నిపుణులు శ్రీనివాస్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రీస్కూల్ ప్రాముఖ్యత గురించి వివరించారు. అభినయ గేయాలతో పిల్లలను ఆకట్టుకునే విధంగా ఎలా చెప్పాలి అన్న విషయాలు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శుభారాణి, మూడు మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుడ్డు ఇవ్వలేదని ప్రజా సంఘాల ఆందోళన

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్నభోజన సమయంలో అందించాల్సిన కోడిగుడ్ల పంపిణీలో ఏజెన్సీ నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు గుడ్లు సరఫరా చేసే హనుమాన్ గుడ్డు పంపిణీ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్ఎఫ్, జైభీమ్ పార్టీ నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. చాకలి ఐలమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పాఠశాలల్లో వారంలో ఐదు సార్లు విద్యార్థులకు గుడ్డు పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.అయితే మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు గుడ్డు పంపిణీ చేయకపోవడంపై ఆగ్రహించిన ప్రజాసంఘాల నాయకులు సమస్యను మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఎంఇఒ కోడిగుడ్ల పంపిణీ ఏజెన్సీకి మద్దతిస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ హనుమంతుకు వినతిపత్రం అందించారు. ఈ విషయంపై మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీదేవిని వివరణ కోరగా పరిగి మండల వ్యాప్తంగా కోడిగుడ్లు ఇవ్వలేదన్నది వాస్తవం కాదని మండల వ్యాప్తంగా మొత్తం 57 పాఠశాలలకు గాను 51 పాఠశాలలో గుడ్లు ఇవ్వడం జరిగిందన్నారు. కేవలం 6 పాఠశాలలో మాత్రమే గుడ్లు ఇవ్వలేదని, కారణం మెగా పేటీఎం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా గుడ్లు ఇవ్వడం వల్ల ఒక రోజుకు తక్కువ వచ్చాయని చెప్పారు. మంగళవారం నుంచి అన్ని పాఠశాలకు గ్రుడ్లు సరఫరా చేస్తామన్నారు. సోమవారం ఇవ్వని పాఠశాలల్లో అదనంగా ఒకరోజు గుడ్లు విద్యార్థులకు ఇవ్వడం జరుగుతుందని ఎంఇఒ - 2 శేషాచలం వెల్లడించారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం ఆదేశారు. స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షులు గంగమ్మ వెంకటరత్నం ఆధ్వర్యంలో ఎంపీడీవో వెంకటలక్ష్మి సమక్షంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు సమస్యలు తమ పరిధిలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వేరుశెనగ విత్తన కాయల పంపిణీ చాలామంది రైతులకు అందలేదని అవసరమైన రైతులందరికీ అందించాలని కోరారు. అలాగే విద్యుత్, రీసర్వే తదితర సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ మారుతి, సర్పంచులు గంగాదేవి నరసింహమూర్తి, నరసింహులు, కిష్టప్ప, జిలాన్ తదితరులతో పాటు సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండలమీట్‌లో పాల్గొన్న ఎంపిపి, తదితరులు

మోసం చేయడమే చంద్రబాబు నైజం : వైసిపి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మేనిఫెస్టోలో చెప్పిన హామీలు తప్పిన నాయకుడు చంద్రబాబు అని ప్రజలను మోసం చేయడం ఆయన నైజం అని వైసిపి రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసుల రెడ్డి,నియోజక వర్గ సమన్వయకర్త బి ఎస్ మక్బుల్ అహ్మద్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని శివాలయం కమ్యూనిటీ భవనంలో మండల కన్వీనర్ కొత్త రంగా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, అల్లాబక్షు, రంగారెడ్డి, కేశవరెడ్డి, సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, సుబహాన్, చెన్నకృష్ణారెడ్డి, ఇరగంరెడ్డి తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సైబర్ మోసం నుంచి నగదు రికవరీ

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలానికి చెందిన ముదిరెడ్డిపల్లి గ్రామ వాసి ఏ. రామిరెడ్డికు చెందిన ఎస్‌బిఐ క్రెడిట్ కార్డ్ నుంచి జూలై 2న రూ.12,400 సైబర్ మోసగాళ్లు అక్రమంగా డెబిట్ చేశారు. బాధితుడు స్వచ్ఛంద సంస్థ ఆర్థిక అక్షరాస్యత కేంద్ర కౌన్సిలర్ బి. హరికృష్ణ సూచనలతో 1930కు కాల్ చేసి, సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం చిలమత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేసి, అవసరమైన సహాయాన్ని పొందాడు. ఈ నేపథ్యంలో జూలై 13న మొత్తం తిరిగి రీఫండ్ కావడంతో బాధితుడు రామిరెడ్డి, హరికష్ణకు, పోలీస్ సిబ్బంది, సైబర్ క్రైమ్ విభాగం, సిఎఫ్ఎల్‌వారికి కృతజ్ఞతలు తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

అత్యవసర సమయాల్లో మహిళల రక్షణ కొరకు ఏర్పాటుచేసిన శక్తి యాప్ పై పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా సోమవారం మహిళా పిఎస్ డిఎస్పి ఆదినారాయణ పర్యవేక్షణలో పాఠశాలలు, కళాశాలలు, రద్దీ ప్రాంతాలలో పోలీస్ సిబ్బందితో పాటు శక్తి టీంబృందాలు అవగాహన కల్పించారు.శక్తి యాప్ మహిళల సెల్ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా రక్షణ ఉంటుందని ప్రతి ఒక్కరు శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే 'కూటమి' ధ్యేయం : టిడిపి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్, అర్బన్

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని రాయలవారిపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన, చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్నామని బాబా జయంతి ఉత్సవాలకు పుట్టపర్తి మున్సిపాలిటీకి నూతన శోభ తీసుకువస్తామని చెప్పారు. అలాగే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు బెస్త చలపతి, బీసీ గంగన్న, కన్వీనర్ బోయ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, దయ్యాల ఉమాపతి, యువ నాయకులు రామ్ లక్ష్మణులు, ఓబులేసు, పుల్లప్ప, గుట్లపల్లి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం : మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 5వ వార్డులో రూ. 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. తాగునీటి సమస్య ఉన్న ఆ వార్డులో సమస్య పరిష్కారానికి నూతన బోరుబావిని తవ్వించారు. అలాగే ప్రశాంతి నిలయం పడమటి గేటు రహదారి నిర్మాణ పనులకు 88 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో రూ. 75 లక్షలతో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. అలాగే పట్టణంలో వివిధ కాలనీలలో వీధిలైట్లు ఏర్పాటు కోసం రూ.10 లక్షలు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సిఎస్ఆర్ ఫండ్ కింద జాయ్ లుకాస్ కంపెనీ ద్వారా రూ. 1. 25 కోట్లు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, ఇంజనీర్ నరసింహమూర్తి, టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, యువ నాయకులు రామ్ లక్ష్మణులు, గంగాధర్ నాయుడు, మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్లు బెస్త చరపతి, పీసీ గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్ర అభివృద్ధికి పెద్ద పీట వేసిందని ప్రభుత్వానికి వస్తున్న ఆదరణకు వైసీపీ శిబిరంలో వణుకు మొదలైందని ఎమ్మెల్యే కందికుంట అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని సింహకోట లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పర్యటించారు. 27 వ వార్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాదున్నీసా, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : మంచి పాలన, ప్రతి ఇంటికి సంక్షేమమే చంద్రబాబు సంకల్పం అని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని నాగులకట్ట వీధిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ప్రతి గ్రామానికి మంచి పాలన అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్ళేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ప్రజల విశ్వాసానికి కూటమి పాలన నిదర్శనంగా నిలిచిందన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన పథకాలు అభివద్ధి కార్యక్రమాలను ఇంటింటికి "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమంలో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డ్ ఇన్‌ఛార్జి షౌకత్, క్లస్టర్ ఇన్‌ఛార్జి సూరి, యూనిట్ ఇన్‌ఛార్జి కటిక ఖన్నా, పాలడుగు చంద్ర, సాయి ప్రసాద్, రేవణ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ డి.ఈ. రమేష్ కుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని చైర్మన్ రమేష్ కుమార్ వార్డు పరిధిలోని ధర్మపురంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఆర్ఎంఎస్ షఫీవుల్లా, అమర్నాథ్ టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు షబ్బీర్, ఆశ్వర్థ, ఇర్షాద్, తిరుపతయ్య, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం చేస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర

వార్డు పర్యటనలో కదిరి ఎమ్మెల్యే కందికుంట, తదితరులు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న హిందూపురం మున్సిపల్‌చైర్మన్, తదితరులు

విద్యాభ్యాసంపై దృష్టి సారించాలి

హిందూపురం : పిల్లల విద్యాభ్యాసం పై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సువర్ణ భారతీ జూనియర్ కరళాశాల ఎఓ అనీల్ కుమార్ సూచించారు. సోమవారం హిందూపురం రూరల్ మండలం పూలకుంట వద్ద ఉన్నా సువర్ణ భారీతి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రవీంద్ర రెడ్డి అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. అధ్యాపకులు, యాజమాన్యం పిల్లల పట్ల చూపుతున్న శ్రద్ధకు విద్యార్థుల తల్లిదండ్రులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ షామీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దీక్షకు ప్రజాసంఘాల మద్దతు

హిందూపురం : కర్నాటక రాష్ట్రం దేవనహళ్లి వద్ద చెన్నారాయపట్నంలో ప్రభుత్వ భూసేకరణకు వ్యతిరేకంగా 1196 రోజులుగా రైతులు చేపట్టిన భూసేకరణకు ఆంధ్ర రాష్ట్ర ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. భూసేకరణకు వ్యతిరేకంగా భూములు ఇవ్వమని రైతులు ఆందోళన సాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఓ.పి.డి.ఆర్, రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, రామ్ కుమార్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వెంకటరామిరెడ్డి, పరిగి నవీన్ తదితరులు అక్కడ రైతులు చేపట్టిన శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలియజేశారు